# సంయుక్త

గొల్లపూడి రామజోగారావుగారు

సంయుక్త కనూజ్‌నగరాధీశ్వరుని తనయ. చారుఘనమాలికానిర్ముక్తరాకాసుధాకరానన సంయుక్త—జయచంద్రుని ప్రేమాతిశయముచే విద్యలన్నిటియం దగణితమగు ప్రవీణత గడించినది. సంగీతసాహిత్యాదివిద్యలందును, విలువిద్యాది యస్త్రవిద్యలందును రాజపుత్రీవ్రాతంబులో కెల్లరాణియై మెప్పుపడసింది.

సంయుక్తభావం మృదుమధురం. ఆమెహృదయం ప్రేమపూరితము—నిజదాసీజనానీకమునెన్నడాసరోజాక్షి యాగ్రహదృష్టితో గమనించియుండలేదు. అట్లుచేయుట కానెలత యోగ్యురాలనియే చెప్పవచ్చు. ఆమె మానససరోవరమునందు ప్రేమతరంగాలుపొంగి పొరలుతూవుండేవి. ఆమె కడగంటివెన్నెలల్లో ప్రేమ ప్రవహిస్తూవుండేది. ఆమె జాలిగుండెకలిగినప్పుడెల్ల ప్రేమావళులు బాష్పవారిమిళితమై బయటికి వెళ్ళివచ్చుచుండేవి. అట్టిప్రేమస్వరూపిణిప్రేమైకదృక్కులకు పృథ్వీరాజు గురిఅయినాడు - అంతేకాదు-పట్టుపడ్డాడుకూడా - అతనిరూపాన్ని జయించి కొనకి తనసాంద్రతరకృపాప్రపూరితహృదయంలో-ప్రేమనిధానమైన మానసంలో-బంధించింది.అతడు సద్గుణపుంజముల కాటపట్టగుటకు ముదమందింది.అతనిరణకౌశల్యమునకు, రాజ్యపాలనాధురంధరతకు మనమునుప్పొంగింది. కన్నతండ్రికి వైరుడైనను ప్రేమించింది...ఆప్రేమ-అతినిర్మలము-ఉషఃకాలమిహికాబిందుసదృశం-ప్రగాఢం...గభీరము.

సంయుక్త స్వయంవరానికి జయచంద్రుం డందఱ నాహ్వానించి పృథ్వీరాజు నుపేక్షించెను. పృథ్వీరాజునెడ యీర్ష్యను ప్రతిమంజేసి ద్వారముకడ నునిచెను. సంయుక్త సభామంటపమున నడుగిడెను. ఆకంజాక్షి కస్తూరికాప్రవాహములుప్రసరించులోచనప్రాంగణములనలుదెసలఁద్రిప్పి నిజనాథునిప్రతిమ వీక్షించెను. ప్రవాళసన్నిభమగు కరాలు మంజులతరశిలావిగ్రహాన్ని పుష్పమాలికచే అలంకరించేయి. అట్టియెడ నామె మనోజ్ఞవదనశశిమండలమున నిసుమంతయేని విషణ్ణభావ ముద్భవించియుండలేదు. ఆమె గభీరమగు ప్రేమకిది నిదర్శనమేగదా.

యుద్ధం ప్రారంభమైనది. ఈర్ష్యాళుడగు జయచంద్రునకు-అనురాగబద్ధుడగు పృథ్వీరాజునకు జరగిన మొదటియుద్ధమిది. సంయుక్తరాకుమారి పురుషవేషమూని కోటవదలి యుద్ధరంగమునఁబ్రవేశించెను. అందామె ధైర్యసాహసమును, సమరనైపుణ్యముఁ దేటతెల్లమయినవి. ప్రియుని సకాలముఁనరక్షించిఆతనితోగూడ విజయలక్ష్మిని వరించింది సంయుక్త. తన ప్రణయమూర్తి సమయస్ఫూర్తికి ఢిల్లీచక్రవర్తి గూడ విస్మయమందసాగెను - రణరంగచరణకళావిశారదగదా-ఆకురంగలోచన.

సంయుక్త నిజనాథునిగూడి తన్నాలమున నోడించి ఢిల్లీకిపోవుట జయచంద్రుని యీర్ష్యానలానికి ఆజ్యముపోసినట్లయింది. ఢిల్లీనగరాధీశుని నాశనంచేయాలని 1052యించు

కున్నాడు. అట్టియెడ స్థానేశ్వరందగ్గర పరాజితుడై నిలువనీడలేక పారుచుండిన కుతుబుద్దీన్-అతనినాయకుడు ఘోరీ-యాతనినయనయుగ్మానికి గోచరించేరు. జయచంద్రుడు వారిసాయం కోరేడు. ఘోరీ సంతోషపరీతస్వాంతుడై హిందూదేశములో కాలుపెట్టేడు...అదేమన దేశనాశనానికిమూలం...సంఘూరిష్టముల కాలవాలం.

రెండవసారి ఢిల్లీనగరాధీశ్వరునకు, ఘోరీ సహాయుఁడైన కన్యాకుబ్జనాగరాధిపునకు యుద్ధం ప్రారంభమయింది. పృథ్వీరాజు మృదుమధురాలాపంబుల నొప్పించి సంయుక్త ముందు తానేసమరానికి సంసిద్ధురాలయింది. ఆమె రణకౌశల్యమెఱింగినవాడగుటచే పృథ్వీరాజందుకు కాటంకపరుపలేదు. సంయుక్త జనకునిచేరి యనేకభంగుల నాతనివేడికొని యాతని తమోశోకానికి ప్రబోధంగలిగించపోయెను-ఆమెహృదయంలో క్రొత్తశక్తి ప్రసన్నమయింది-మాతృభూమియగు నార్యావర్తమంతయు నిక నేరీతిని ధ్వంసముకాబోవుచున్నదో దలంచుకొనినపుడెల్ల నాకోమలహృదయ విభీతమనస్క యగుచుండెను. ఆగోహంతకులపాల బడుచుండిన స్వచ్ఛందభారతనారీలోకమున కెట్టి మానభంగము కలుగునోయని తల్లడిల్లసాగెను. కృతఘ్నులగు ఈమ్లేచ్ఛులకుతోడుబడిన తనతండ్రి నశించునని యూహించుకొనియెను... తండ్రియా......నిజనాథునిపై కత్తికట్టుటయా...పవిత్రంబగు నీయార్యావర్తము యవనులపాలబడవేయుటయా...

యుద్ధముతప్పినదికాదు-సంయుక్త నిజనాథునిచరణంబుల స్మరించుకొనుచు గైజియాపురమున కరిగెను. రణరంగమున నామహారాణిపేరు తాండవమాడినది. సంయుక్త ధాటికి తాళలేక రాజకులుండు గేజియాపురమునువిడిచి పారిపోయెను...తుద కాపవిత్రహృదయ ఫరుక్నగరమున వైరిమాయలకు గుఱియై జీవనముల గోలుపోయెను. తనకోమలదేహాన్ని మాతృభూమియగు నార్యావర్తమున కర్పించింది. అందుకొఱకై పోరుచు సంగ్రామమున వీరమరణమొందినది. పతికి ప్రార్థనాపూర్వకముగ జరిగినదంతయు విన్నవించుకొనియెను. అంతఃపురకాంతల యీలువున కెట్టిభంగమురాకుండ కాపాడ నర్మసఖికి కబురంపెను... ఈర్ష్యావేశుడై...క్రూరుడై...అవివేకియై-యింతలుగావించిన జనకునికికూడ నాధీరసాధ్వి వందనము లర్పించుకొనియెను...

సంయుక్తా! నీవంటి నారీశిరోభూషలు వర్తిలిన యార్యావర్తము నేడెట్టి దుర్దశ పాలయ్యెను?

## ఆమోదము

శ్రీమతి వింజమూరి వేంకటరత్నమ్మగారు

లలితరచనావిశేషవిలాసగతుల
నమరుపనడంపుఁదీఁగయై యాంధ్రసీమ
మెల్లఁబ్రాఁకెడు 'గృహలక్ష్మి' యీశుకృపను
దినదినప్రవృద్ధినిగాంచి తేజరిల్లు.